క్లుప్తంగా

అబ్బురపరిచిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ నాట్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండు రోజుల నృత్య ప్రదర్శనలు మొదలయ్యాయి. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి విశాఖ చాప్టర్ క్రెడిట్ అధ్యక్షుడు ధర్మేంద్ర, విశిష్ట అతిథి ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ ప్రారంభించారు. నగరానికి చెందిన 18 మంది గురువులు, వారి శిష్య బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ఆహుతులను అబ్బురపరిచారు. అనంతరం చిన్నారులకు అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాట్య దినోత్సవం విశిష్టతను వివరించారు. విశాఖ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, గోపీనాథ్, మంజూష, సింధుజ, మహాలక్ష్మి, కల్యాణి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

మహిళకు బెదిరింపులు.. కేసు నమోదు

ఎంవీపీకాలనీ: కేఆర్‌ఎం కాలనీకి చెందిన కె.రూప అనే మహిళను చంపేస్తానని ఓ వ్యక్తి బెదిరించడంపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. కేఆర్‌ఎం కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న రూపకు ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్ సమీపంలో ఉండే సాలిగ్రాము సతీష్ అనే వ్యక్తితో సాన్నిహిత్యం ఉంది. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు, సమస్యల కారణంగా గత నెల 3న ఆమెను చంపడానికి సతీష్ ప్రయత్నించాడు. దీంతోపాటు ఈ నెల 9న కేఆర్‌ఎం కాలనీలోని రూప ఇంటికి వెళ్లి బెదిరించడంతో పాటు దూషించాడు. తరచూ ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పహల్గామ్ దాడికి మూల్యం చెల్లించక తప్పదు



మూలా వెంకటరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మురళీనగర్: పహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇస్తున్న దేశాలు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. మురళీనగర్ బొత్స స్క్వేర్‌లో శనివారం నిర్వహించిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో శాంతి నెలకొనడాన్ని జీర్ణించుకోలేని శక్తులు దాడులకు తెగబడుతున్నాయని అన్నారు. ఈ దాడి దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే అని, భారతీయులంతా ఒక్కటేనని నిరూపించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. అనంతరం విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ కాశీ విశ్వనాథం, బులుసు జగదీష్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మూలా వెంకటరావు మంత్రి సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు, ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు, రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర పాల్గొన్నారు.

మొరాయించిన బోర్లు



రాజీవ్‌నగర్‌లో పనిచేయని బోరు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్, రాజీవ్‌నగర్‌లో పలు చోట్ల చేతిబోర్లు మొరాయించాయి. దీంతో స్థానికుల నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని పాత డెయిరీఫారం దరి ఆయా కాలనీల్లో కొన్ని బోర్లు పనిచేయడం లేదు. కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోర్లు పాడయ్యాయి. వాటి నుంచి నీరు రాక దిష్టిబొమ్మల్లా మిగిలాయి. దీంతో కుళాయిలు రానప్పుడు నీటికి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు రోజూ సక్రమంగా కుళాయిలు విడిచిపెడితే నీటి సమస్య ఇక్కడ ఉండదు. కుళాయి రాని రోజు ఈ ప్రాంతంలో చేతి బోర్లే అవసరానికి ఉపయోగపడేవి. అవి మూలకు చేరడంతో నీటి సమస్య ఏర్పడింది. సంబంధిత అధికారులు పరిశీలించి పాడైన బోర్లను బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వేళాపాళా లేకుండా.. కరెంట్ కట్

ఆరిలోవ ప్రాంతంలో అప్రకటిత విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. ఒకవైపు వేసవి తాపం.. మరోవైపు వేళాపాళా లేని కరెంట్ కోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గంటల తరబడి విద్యుత్ లేక ఉక్కపోత, చీకటిలో గడుపుతున్నారు. నెల ప్రారంభమయ్యే సరికి కరెంట్ బిల్లులు మాత్రం మోత మోగిస్తున్నాయి. విద్యుత్ లేకపోయినా వేల రూపాయల్లో బిల్లులు వస్తున్నాయంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండలు మండిపోతున్న తరుణంలో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. ఇంట్లో ఉందామంటే కరెంట్ లేక ఉక్కపోతతో చెమట్లు పడుతున్నాయి. ఈ ఇబ్బందులను పట్టని విద్యుత్ విభాగం అధికారులు ఎడాపెడా కరెంట్ కట్ చేసేస్తున్నారు.

- ఆరిలోవ



ఆరిలోవ ప్రాంతం

- ఆరిలోవ ప్రాంతంలో అప్రకటిత విద్యుత్ కోతలు
- రోజూ గంటల తరబడి నిలిపివేత
- వేసవి తాపం, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- వినియోగదారుల కళ్లు బైర్లు కమ్మేలా కరెంట్ బిల్లులు

విద్యుత్ మెయింటెనెన్స్, మరమ్మతు పనుల పేరుతో ఏపీఈపీడీసీఎల్ జోన్-3 విద్యుత్ విభాగం అధికారులు ముందుగా ప్రకటించి ప్రతి రోజూ కొన్ని కాలనీల్లో 4 నుంచి 5 గంటల పాటు ఏకధాటిగా కరెంట్ తీసేస్తున్నారు. ఏదోచోట పనులు చేపట్టినా.. అన్ని ప్రాంతాల్లోనూ మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరా ఆపేస్తున్నారు. అంతటితో ఆగకుండా అప్రకటితంగా మరికొన్ని గంటలు నిలిపేస్తున్నారు. విద్యుత్ ఏ సమయంలో ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో లైట్లు వెలగడం లేదు. ఫ్యాన్‌లు తిరగడం లేదు. ఏసీలు దిష్టిబొమ్మలుగా మారుతున్నాయి. ఇంట్లో సరదాగా టీవీ చూడాలన్నా.. కరెంట్ లేక అవి కూడా మూగబోతున్నాయి. పవర్ లేకపోవడంతో బిల్లులు తగ్గుతాయనుకుంటే.. ఎప్పటివో అంటూ సర్ చార్జీల పేరుతో రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. వాటిని చూసినప్పుడు కళ్లు బైర్లు కమ్ముతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

ప్రతి రోజూ ఇదే తంతు..

ఆరిలోవ ప్రాంతంలోని టీఐసీ పాయింట్, బాలాజీనగర్, రవీంద్రనగర్, తోటగరువు, సంతపాలెం, గాంధీనగర్, అన్నానగర్‌ల్లో విద్యుత్ మెయింటెనెన్స్ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని అధికారులు ముందుగా ప్రకటించారు. వాటితోపాటు సుందరయ్య కాలనీ, అంబేడ్కర్ నగర్, జ్యోతినగర్, శ్రీకాంత్‌నగర్ ప్రాంతాల్లో కూడా అప్రకటితంగా విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతోపాటు సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు, 5.25 నుంచి 6.10 గంటల వరకు కరెంట్ కట్ చేశారు. లీలాసుందరినగర్‌లో సాయంత్రం 4.40 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇలా ప్రతి రోజూ అన్ని ప్రాంతాల్లోనూ అప్రకటిత కోతలు కొనసాగుతున్నాయి. దీంతో ఆరిలోవ ప్రాంత ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.



రోజూ విద్యుత్ కోతలు



కరెంట్ పోవడానికి వేళాపాళా లేదు. రోజూ ఇదే పరిస్థితి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 4, 5 సార్లు విద్యుత్ తీసేశారు. దీంతో ఇంట్లో గాలి ఆడక బయట గడపాల్సి వచ్చింది. ఏదో పనిచేసుకుని ఇంటికి వెళ్లి ఫ్యాన్ కింద కూర్చుందామంటే కరెంట్ ఉండటం లేదు.

– మోహన్, లీలాసుందరినగర్

అధికంగా కరెంట్ బిల్లులు



ఓ పక్క రోజులో ఎక్కువ సమయం కరెంట్ తీసేస్తున్నారు. విద్యుత్ బిల్లులు మాత్రం ఎక్కువగా వేసేస్తున్నారు. ట్రూ అప్ చార్జీలు వేయడంతో కరెంట్ బిల్లులు మోత మోగిస్తున్నారు. విద్యుత్ మాత్రం ఉంచడం లేదు. తరుచూ కరెంట్ తీసేయడంతో అసౌకర్యంతో గడుపుతున్నాయి.

– టి.గణపతి, టి.ఐ.సి పాయింట్

ఎప్పుడు పోతుందో తెలియదు

ఎప్పుడు కరెంట్ పోతుందో తెలియడం లేదు. రోజూ ఏదో సమయంలో కరెంట్ తీసేస్తున్నారు. ఒక్కో రోజు నాలుగైదు గంటలు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. పగలంతా పనిచేసుకుని ఖాళీ సమయంలో సరదాగా టీవీ చూద్దామన్నా విద్యుత్ లేక చూడలేకపోతున్నాం.

– ఆర్.సత్యవతి, బాలాజీనగర్

అదనంగా రూ.422 బిల్లు

మా ప్రాంతంలో తరచూ కరెంట్ పోతోంది. విద్యుత్ ఉండటం లేదు కదా.. ఈ నెల బిల్లు తక్కువ వస్తాదనుకుంటే అదీ జరగడం లేదు. ఈ నెల మాకు వినియోగించిన దానికంటే అదనంగా రూ.422 విద్యుత్ బిల్లు వేశారు. విద్యుత్ సక్రమంగా ఉండటం లేదు. బిల్లు కట్టక తప్పడం లేదు.

– ఎం.సుజాత, సుందరయ్య కాలనీ

హాజరు లేకుంటే పరీక్షలకు అనుమతించం

ఏయూ సీఎస్‌ఈ విభాగాధిపతి వెంకటరావు

విశాఖ విద్య: ఇంజినీరింగ్ విద్యార్థులకు నిబంధనల మేరకు హాజరు లేకుంటే పరీక్షలకు అనుమతించబోమని ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కాలేజీలో రెండు, నాల్గో సెమిస్టర్ పరీక్షలకు 1,478 మంది విద్యార్థులు ఫీజు చెల్లించగా.. వీరిలో 29 మందికి హాజరు శాతం సరిపోనందున పరీక్షలకు అనుమతించలేదని తెలిపారు. విద్యార్థులు కావాలనే వర్సిటీ పరిపాలన భవనం ముందు ఆందోళన చేశారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో దీనిపై విచారణ చేశామని, వారందరికీ హాజరు సరిపోలేదనే విషయం తేలిందని చెప్పారు. కొంతమంది విద్యార్థులు ల్యాబ్స్‌కు అటెండ్ కాలేదని, సరిగా క్లాసులకు కూడా హాజరు కాలేదనే విషయాన్ని వారి తల్లిదండ్రులకు వివరించామన్నారు. ఏయూ ప్రతిష్టను దెబ్బతీసేలా కార్యక్రమాలు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులంతా బాగా చదువుకోవాలని సూచించారు.

టెన్త్ టాపర్ లిఖితకు డీఈవో అభినందన



లిఖితను అభినందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఎంవీపీకాలనీ: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఫస్ట్ సాధించిన ఎంవీపీ కాలనీ భాష్యం స్కూల్ విద్యార్థిని ఆళ్ల లిఖితను డీఈవో ప్రేమ్‌కుమార్ అభినందించారు. 599/600 మార్కులు సాధించి సత్తా చాటిన లిఖిత తన తల్లిదండ్రులు, స్కూల్ ప్రిన్సిపాల్ శిల్పతో కలిసి శనివారం డీఈవోతో పాటు విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. వారు లిఖితను ప్రశంసించి.. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఏయూ అంతర్జాతీయ ఖ్యాతి సాధించాలి

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- ఘనంగా శతాబ్ది ఉత్సవాల ప్రారంభం





శతాబ్ది ఉత్సవాల బెలూన్ ఎగురవేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, (ఇన్‌సెట్) ప్రత్యేక బెలూన్

విశాఖ విద్య: రాష్ట్రానికే తలమానికంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తుందని, అంతర్జాతీయ స్థాయిలో ఏయూ ఖ్యాతి సాధించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆకాంక్షించారు. శనివారం ఉదయం ఏయూ పరిపాలనా భవనం వద్ద శతాబ్ది ఉత్సవాల ప్రారంభ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిద్ధం చేసిన ప్రత్యేక బెలూన్‌ను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న అత్యుత్తమ బోధనా విధానాలను ఏయూలో అమలు చేయాలని సూచించారు. వర్సిటీ విద్యార్థులు సాధిస్తున్న ఉద్యోగ అవకాశాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఏయూ ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. భవిష్యత్తులో అభివృద్ధి చెందిన దేశాల విద్యార్థులు, ఆచార్యులు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వస్తారని ఆకాంక్షించారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఘనమైన వారసత్వాన్ని కలిగి ఉందని, దీనిని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. సీపీ అందించిన విలువైన సూచనలను విజన్ డాక్యుమెంట్‌లో భాగం చేస్తామని చెప్పారు. విదేశీ విద్యార్థులు, ఆచార్యులను ఏయూ స్వాగతిస్తోందన్నారు. ఏయూ పరిపాలన భవనం, స్నాతకోత్సవ మందిరం, సిరిపురం కూడలి వద్ద నున్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు, పలువురు ప్రముఖుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏయూ మెయిన్ గేట్ వద్ద ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయ చిహ్నం(లోగో)కు పూలమాల వేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్, ఆచార్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ఆచార్యులు

వీడీసీఏ మాజీ అధ్యక్షుడు అహ్మద్ మృతి

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు, విశ్రాంత జిల్లా కలెక్టర్ కె.ఎం. అహ్మద్(90) ఈనెల 25న అమెరికాలోని కనెక్టికట్‌లో మృతి చెందారు. ఆయనకు భార్య సల్మా, కుమార్తె అమీనా ఉన్నారు. అప్పట్లో ఆంధ్ర రంజీకి ఆడిన 30 మందిలో 20 మంది నెల రోజుల పాటు విశాఖలో హేము వద్ద శిక్షణ పొంది ప్రతిభ చూపిన వారే. అహ్మద్ మృతి పట్ల జిల్లా క్రికెట్ సంఘం కార్యవర్గం ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది.

ఆర్చరీ పోటీల విజేత ఒడిశా



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టీసీఆర్‌టీఎం ఈడీ రాణి మందా

కొమ్మాది: బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జన జాతీయ గౌరవ్ వర్ష కార్యక్రమంలో భాగంగా జన జాతీయ ఖేల్ మహోత్సవ్-ట్రైబల్ ఆర్చరీ మీట్ శనివారం గీతం కళాశాల ప్రాంగణంలో ఘనంగా ముగిశాయి. రెండో రోజు ఆర్చరీ మీట్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర్రావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీసీఆర్‌టీఎం బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆర్చరీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, అండమాన్ నికోబార్‌లతో పాటు రాష్ట్రంలోని 8 ఐటీడీఏల నుంచి సీనియర్, జూనియర్ స్థాయిలో గిరిజన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఒడిశాఖ మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, రెండో స్థానాన్ని తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. విజేతలకు టీసీఆర్‌టీఎం ఈడీ రాణిమందా సర్టిఫికెట్లను, బహుమతులును అందజేశారు.

ఉగ్రదాడి బాధితులకు అండగా ఎన్‌ఎస్‌ఈ

బీచ్‌రోడ్డు: కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అత్యంత హేయమైన చర్యని ది నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి ఎన్‌ఎస్‌ఈ తరపున రూ.4 లక్షలు (మొత్తం కోటి రూపాయలు) ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు. ఈ విషాద సమయంలో దేశంతో కలిసి నడుస్తామని, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని చెప్పారు.

ముగిసిన చందనం అరగదీత



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత శనివారంతో పూర్తయింది. ఈనెల 30న చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి సమర్పించాల్సిన మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈనెల 24వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా మూడు రోజుల్లోనే అరగదీతను సిబ్బంది పూర్తిచేశారు. కావాల్సిన సుమారు 125 కిలోల పచ్చి చందనాన్ని సిద్ధం చేశారు.

ఉగ్రదాడికి నిరసనగా భారీ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న అసోసియేషన్ల సభ్యులు

ఆరిలోవ: కశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసి అమాయక పర్యాటకులను బలితీసుకున్న సంఘటనను నిరసిస్తూ ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆరిలోవలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం పెద్దలు ర్యాలీకి సంఘీభావం తెలిపారు. వారంతా ర్యాలీలో పాల్గొని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఆరిలోవ ప్రెస్ క్లబ్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ బీఆర్‌టీఎస్ రోడ్డులో దీన్‌దయాల్‌పురం కూడలి మీదుగా చినగదిలికి చేరుకుంది. అక్కడ కూడలిలో మానవహారం నిర్వహించి ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి హెల్త్‌సిటీ మీదుగా ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీ చేరింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, ముస్లిం పెద్దలు, వాకర్స్ పలువురు మాట్లాడుతూ అందరం కలసికట్టుగా దేశానికి మద్దతు పలకాలన్నారు. ఉగ్రవాదం నశించే వరకు అందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఉగ్రదాడిలో అమరులకు నివాళులు

బీచ్‌రోడ్డు: పహల్గామ్ ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి వైజాగ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అసోసియేషన్(వెప్సా) సభ్యులు నివాళులర్పించారు. సిరిపురంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన నెలవారీ సమావేశంలో తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జూలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రభుత్వ అధికారులతోపాటు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ కూడా తమ వంతు పాత్ర పోషిస్తోందన్నారు. వెప్సా అధ్యక్షుడు ధరిమిరెడ్డి రాజు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ ఏజెన్సీలకు మరింత తోడుగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వం తరఫున తమకు గుర్తింపు కావాలని, అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామ్‌కిషోర్, గవ్వ శ్రీనివాసరావు, దంతేశ్వరరావు, మోహన్ రాజ్, హరీష్‌కుమార్, చిన్నారావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పక్కాగా సంక్షేమ పథకాల అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, దివ్యాంగుల పథకాల అమలు ప్రతి శాఖలో నోడల్ అధికారి పర్యవేక్షణలో జరగాలని సూచించారు. దివ్యాంగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని, వారి హక్కులు, చట్టాలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. దివ్యాంగుల పిల్లలకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, వారు అన్ని ప్రదేశాలను సందర్శించేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవితో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డివిజనల్, మండల స్థాయిలో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ మీటింగ్‌లో కలెక్టర్ మాట్లాడారు.

భానునగర్ పార్కులో ఆక్రమణల తొలగింపు



పార్కులోని అక్రమ కట్టడాలను తొలగిస్తున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు భానునగర్‌లోని 450 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, దానిని వెంటనే తొలగించి స్థలాన్ని తమకు అప్పగించాలని భానునగర్ నివాసుల అసోసియేషన్ చేసిన పోరాటానికి ఎట్టకేలకు ఫలితం లభించింది. పార్కు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన కట్టడాలను శనివారం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీసు పహారాతో తొలగించారు. దీనిపై చొరవ చూపి సహకరించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు, టౌన్ సర్వేయర్ ఎస్.తిరుపతిరావుకు సచివాలయం డబ్ల్యూపీ ముత్యమాంబ కాలనీ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఈ స్థలంలో శంకుస్థాపన చేసి పార్కు గాని, సామాజిక భవనం గాని నిర్మించనున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు. కాలనీ వాసులు వంకా శివ శంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, ఒమ్మి నాయుడు, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా తదితరులు పాల్గొన్నారు.